క్లుప్తంగా

ఉత్సాహంగా నేషనల్ స్పోర్ట్స్ డే



వెల్‌నెస్ రన్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం నేషనల్ స్పోర్ట్స్ డే ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని రన్ ఫర్ వెల్‌నెస్ నినాదంతో జెండా ఊపి రన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేజర్.ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, పలువురు ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.


సాలిపేటలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు సాలిపేట రామాలయం వీధిలో వినాయక నవ రాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్నదానం చేశారు. సాలిపేట, కుమ్మరవీధి తదితర ప్రాంతాల ప్రజలు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కొమ్ము సూర్యారావు, కాశీశ్వరి, రొబ్బా గంగా భవానీ, కార్తీక్, లిఖిత్, అఖిల్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించాలని, 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు ప్రాణం నిలిపిన మెడికవర్ వైద్యులు



నెలలు నిండకుండా పుట్టిన బిడ్డతో మెడికవర్ వైద్యుడు సాయి సునీల్‌కిషోర్

మహారాణిపేట: నెలలు నిండకుండా, తక్కువ బరువుతో పుట్టిన శిశువుకు మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యులు అద్భుతమైన చికిత్స అందించి ప్రాణం పోశారు. తల్లికి కూడా ఆరోగ్యాన్ని ప్రసాదించారు. కేజీహెచ్ డౌన్‌లోని మెడికవర్ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెడికవర్ నియోనెటాల్ వైద్య నిపుణుడు డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన బెహ్రా అనే వ్యక్తి తన భార్య గర్భిణిగా ఉన్న సమయంలో విశాఖ మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అధిక రక్తపోటు రావడంతో 25 వారాల ముందే డెలివరీ జరిగింది. 580 గ్రాముల బరువుతో పండంటి బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు ఊపిరితిత్తులు, ఇతర అవయవాలు కూడా పూర్తిగా ఎదగలేదు. రోగనిరోధక శక్తి కూడా తక్కువగా ఉంది. ఇన్‌ఫెక్షన్లు సైతం వచ్చాయి. బేబీ బతికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని, కోలుకోవడం చాలా కష్టమని భావించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ చికిత్స చేయడంతో 90 రోజుల అనంతరం పసిబిడ్డ బరువు పెరిగింది. అవసరమైన పలు పోషకాలు అందజేశారు. 1.7 కిలోల బరువు పెరగడంతో మెదడు పనితీరు పెరిగింది. బిడ్డ సురక్షితంగా, క్షేమంగా ఉండటంతో శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశామని, తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ తెలిపారు. సమావేశంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కేసుల పైనే ఫోకస్

- ట్రాఫిక్ నియంత్రణ వద్దు.. జరిమానాలే ముద్దు
- వాహనాల తనిఖీ పేరిట వేధింపులు
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు



హెల్మెట్ ధరించని వారిని వెనుక నుంచి సెల్‌ఫోన్‌తో ఫొటో తీస్తున్న కానిస్టేబుల్



హెల్మెట్ లేదని వాహన చోదకుడిని ఆపి ఫొటో తీస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్(ఫైల్)

దాబాగార్డెన్స్: వాహనాల వేగ నియంత్రణ.. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్.. డ్రంక్ అండ్ డ్రైవ్ పేరిట ట్రాఫిక్ పోలీసుల వేధింపులు మితిమీరుతున్నాయి. జాతీయ రహదారిపై పరిమిత వేగం దాటిన వాహనాలకు అపరాధ రుసుం విధించేవారు. మరో అడుగు ముందుకేసిన ట్రాఫిక్ విభాగం సాధారణ రోడ్లపై వేగ నియంత్రణ తనిఖీలు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ఎడాపెడా తనిఖీలు జరుపుతున్నారు. హైవేలో గంటకు 60 కిలోమీటర్లు.. సాధారణ రోడ్లపై గంటకు 40 కిలోమీటర్లు దాటితే కేసులు నమోదు చేస్తున్నారు. ఒక్కో వాహనం నుంచి వందలాది రూపాయలు అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ప్రధాన, సాధారణ రోడ్లలో వేగ నియంత్రణ పాటించాలనే అవగాహన కల్పించడంలో ట్రాఫిక్ పోలీసులు ఆసక్తి చూపడం లేదు. తనిఖీలు జరపడం, జరిమానాలు విధించడం సాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

చట్టం ఏం చెబుతోంది..

మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ కొత్తగా జారీ చేసిన ఉత్తర్వులు వాహనం ఎంత వేగంతో ప్రయాణించాలి, ఆయా రోడ్లకు తగ్గట్టుగా వేగం ఎంత ఉండాలి అనేది ప్రకటించింది. పోలీసులు మాత్రం తమకు నచ్చినట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేసుల భయంతో ఉక్కిరిబిక్కిరి

నగరంలో ట్రాఫిక్ విధులు తనిఖీలకే పరిమితమా? ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తున్నా పోలీసులు పట్టించుకోరా? ఏదో సాకుతో కేసులు రాయడం.. డబ్బులు గుంజడం వీరి విధా? అంటూ వాహన చోదకులు మండిపడుతున్నారు. వాహనంతో రోడ్డెక్కాలంటే ప్రమాదాల బారిన పడతామనే భయం కన్నా.. తనిఖీల పేరిట జరిమానాలు విధించడం భయాందోళనలకు గురిచేస్తోందని పలువురు వాపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ తనిఖీల పేరిట వేధింపులు తగవంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్లలో అధికారులు ట్రాఫిక్ సమస్యను పట్టించుకోకుండా జరిమానాలతో వచ్చే ఆదాయంపై దృష్టి సారించడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ను అదుపు చేయకుండా వాహనాల రికార్డుల తనిఖీలపై దృష్టిని సారిస్తున్నారని మండిపడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు పట్టించుకోవాలి



కుర్రకారు ద్విచక్ర వాహనాలపై రెచ్చిపోతున్నా.. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. హెల్మెట్ లేదని, రికార్డులు లేవని అమాయకులు, వయసు మీరిన వారి నుంచి జరిమానాలు వసూలు చేస్తున్నారే తప్పా.. ట్రిబుల్ రైడింగ్, కర్ణభేరి పగిలినట్టు పెద్ద పెద్ద హారన్లు.. ర్యాష్ డ్రైవింగ్‌తో ఇష్టానుసారంగా వెళ్తున్న యువతను పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా ఫొటోలు తీసి వదిలేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నా.. ర్యాష్ డ్రైవింగ్‌ను అరికట్టాలన్నా ముందుగా కుర్రకారుపై పోలీసులు దృష్టి సారించాలి.

– సారిక దైవకుమార్, ఆశిపాప వీధి

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

వాహనాల వేగం తగ్గుముఖం పట్టాలన్నదే ట్రాఫిక్ పోలీసుల లక్ష్యం. జరిమానాలకు ప్రాధాన్యం ఇవ్వబోం. ప్రమాదాలు జరగకుండా హెల్మెట్లు వాడాలని చోదకులకు సూచిస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసులు నమోదు చేస్తున్నాం.

– ట్రాఫిక్ పోలీసులు, వన్ టౌన్

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

దాబాగార్డెన్స్ : వైఎస్సార్ సీపీ కల్చరల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితుడైన కంటుముచ్చు సాగర్‌కు ఆ పార్టీ నాయకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వార్డు అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబంలో నిస్వార్థ సేవలందిస్తున్న కంటుముచ్చు సాగర్ మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారిని గుర్తించిన వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతగా, అహర్నిశలు పార్టీ బలోపేతానికి పనిచేస్తానన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ‘గిడుగు’ జయంతి

దాబాగార్డెన్స్: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల పిల్లలకు వివిధ అంశాలపై పోటీలు ఏర్పాటు చేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలుగా విభజించి నిర్వహించిన పోటీలో 24 పాఠశాలల నుంచి 371 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలతోపాటు పోటీల్లో పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏయూ దూర విద్య తెలుగు విభాగం ఆచార్యుడు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గిడుగు గొప్పతనం వివరించడమే గాక గత వందేళ్లలో గుర్తుంచుకోదగ్గ మహనీయులు ముగ్గురేనని, వారిలో సామాజిక సేవ చేసిన కందుకూరి, భాషా సేవ చేసిన గిడుగు రామమూర్తి, సాహిత్య సేవ చేసిన గురజాడని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దయానంద్‌ను సిమ్మన్న చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యుడు జి.ఎస్.రాజేశ్వరరావు, కార్యక్రమాల కమిటీ సభ్యుడు సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్యాలయం, సౌత్ జైల్ రోడ్డు, సెంట్రల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, సెంట్రల్ పార్క్, సౌత్ జైల్ రోడ్డుపై బహిరంగంగా అసాంఘిక కార్యక్రమాలు రాత్రి పూట జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు, పోలీసులు గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా వ్యభిచారం, గంజాయి, ఆల్కహాల్ సేవించడం తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తనిఖీలలో బహిర్గతమైందన్నారు. ఈ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలో జోన్ – 4 కమిషనర్ మల్లయ్యనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహితను కాపాడిన పోలీసులు

అల్లిపురం: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవడానికి ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహిత ఆచూకీ కనిపెట్టి కుటుంబం చెంతకు మహారాణిపేట పోలీసులు చేర్చారు. సీఐ దివాకర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాణి పేట పోలీస్ స్టేషన్ పరిధి బీచ్‌రోడ్‌లో నివసిస్తున్న దంపతుల మధ్య మనస్పర్థలు కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ఇంటి నుంచి భార్య వెళ్లిపోయింది. వెంటనే ఆమె భర్త 112 నంబర్‌కు కాల్ చేయగా అక్కడ డ్యూటీలో ఉన్న సీఐ సిబ్బందిని పంపించి సదరు వివాహిత ఆచూకీ తెలుసుకుని కుటుంబ సభ్యుల చెంతకు సురక్షితంగా చేర్చారు. ఈ సందర్భంగా మహారాణిపేట పోలీసు సిబ్బందిని పోలీసు కమిషనర్, డీసీపీ–1 అజిత్ వేజెండ్ల, ఈస్ట్ ఏసీపీ అభినందించారు.

టేబుల్ టెన్నిస్ టోర్నీ విజేత బుల్లయ్య కళాశాల

దాబాగార్డెన్స్ : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దివస్ వేడుకలు శుక్రవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తెలిపారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్న ఈ సంవత్సరంలో థీమ్ ఆఫ్ ది నేషనల్ స్పోర్ట్స్ డే – 2025కి అనుగుణంగా వుమెన్ టేబుల్ టెన్నిస్ ఇన్విటేషనల్ టోర్నమెంట్ నిర్వహించారు. నగరంలోని ఏడు డిగ్రీ కళాశాలల నుంచి టీమ్స్ పాల్గొనగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్టు ప్రథమ స్థానంలో, సెయింట్ జోసెఫ్స్ వుమెన్ కాలేజ్ ద్వితీయ స్థానంలో, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్ అనేది యువత విజయానికి సోపానమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నివేదిత, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్లతో ప్రిన్సిపాల్ మంజుల, కిరణ్మయి తదితరులు

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం



నిరసన తెలుపుతున్న కలాసీలు, నాయకులు

దాబాగార్డెన్స్ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ కళాసీలు శుక్రవారం నిరసన చేపట్టారు. టౌన్‌కొత్త రోడ్డు సమీపాన ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరిట కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, కళాసీలు అనేక ఇబ్బందులు పడతున్నారన్నారు. పెంచిన కరెంటు చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అదానీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా స్మార్ట్ మీటర్లు బలవంతంగా బిగించడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని కూటమి నాయకులు నినాదాలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అవే స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కరెంటు చార్జీలు విపరీతంగా పెరుగుతాయని, తర్వాత రీచార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుందని, అందువల్ల ఇలాంటి స్మార్ట్ మీటర్లు మనకొద్దంటూ పిలుపునిచ్చారు. తక్షణమే కూటమి ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిటూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఆరోగ్యకర సమాజం



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: ధూమపానానికి వ్యతిరేకంగా జిల్లాలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక శుక్రవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, కృషి, సామాజిక బాధ్యతతో పాఠశాలలు, సమాజంలో ధూమపాన వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని కొనియాడారు. వారిని అభినందించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. యువ ప్రతిభావంతుల సేవలను జిల్లా అధికారులు అభినందించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

విఘ్నేశ్వరుడి అన్నదానానికి వాసుపల్లి విరాళం



ఉత్సవ నిర్వాహకులకు రూ.10 వేల విరాళం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల విరాళమిచ్చారు. ఆశీల్‌మెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో శుక్రవారం ఉత్సవ నిర్వాహకులు సోల్జర్‌పేట యూత్ బాయ్స్‌కి తన సొంత నిధులతో నగదు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో స్వామిని ఆరాధిస్తూ నిర్వహించే ఇటువంటి అన్నదానాల్లో నవరాత్రులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించి కడుపు నింపుకునే పేదలు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి ఆకలి తీర్చడంలో ఆధ్యాత్మిక ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తాను విశాఖలో భారీ గణనాథుడిని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించామన్నారు. తన పేరులోనే స్వామి వారు ఉండటం తన అదృష్టంగా భావిస్తానని వాసుపల్లి పేర్కొన్నారు. 38వ వార్డు అధ్యక్షుడు గురజాపు రవి, అసోసియేషన్ అధ్యక్షుడు బుడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, చోడిపిల్లి నూకరాజు, సిహెచ్.ధనరాజు, లండా నూకరాజు, సిహెచ్.సతీష్, లోకేష్, అమరదేవి పాల్గొన్నారు.

జనసేన ప్లీనరీ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

విశాఖ సిటీ: ‘సేనతో సేనాని’ పేరుతో నిర్వహిస్తున్న జనసేన ప్లీనరీ నేపథ్యంలో శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు పలు సూచనలు చేశారు.

- ప్రజాప్రతినిధులు వాహనాల్లో ఆర్‌కే జంక్షన్ మీదుగా వచ్చి మున్సిపల్ స్టేడియం లోపల ఉన్న వీఐపీ పార్కింగ్ ప్రాంతంలో నిలపాలి.
- ద్విచక్ర వాహనాలపై వచ్చే పార్టీ కార్యకర్తలు/ప్రజలు కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్ట్ ఆర్చ్ ప్రధాన ద్వారం నుంచి లోపలకు వెళ్లాలి. అక్కడ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలంలో వారి వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. అక్కడి నుంచి నడుచుకుంటూ సీ హార్స్ జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియంలోకి వెళ్లాలి.
- ఆటో/కార్/బస్సుల్లో వచ్చే కార్యకర్తలు/ప్రజలు పోర్ట్ ఆర్చ్ ప్రధాన ద్వారం నుంచి లోపలకు వెళ్లి వేదాంత గేటు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి నడుచుకుంటూ సీహార్స్ జంక్షన్ మీదుగా స్టేడియంలోకి ప్రవేశించాలి.
- పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్, ఓల్డ్ పోస్టాఫీస్, ఆర్‌కే జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియం వైపు ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- ప్లీనరీ సందర్భంగా శనివారం చౌల్ట్రీ మీదుగా పాత పోస్టాఫీస్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు /ఇతర వాహనాలన్నీ తిరిగి అదే మార్గంలో ప్రయాణించాలి.

గణపతికి పూజలు



41వ వార్డులో గణపతిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీ జీఎస్‌పీ యూత్ కింగ్స్, కాన్వెంట్ కూడలిలో వైష్ణవి హోల్‌సేల్ మార్కెట్ సౌభాగ్య గణపతి యూత్ అసోసియేషన్, నికోలస్ వీధిలో హెచ్‌వోడీ యూత్, ఫియర్‌లెస్ బాయ్స్, పోస్టాఫీస్ వీధిలో ఏర్పాటు చేసిన మండపాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల్లో కొలువైన వినాయకుడి ని శుక్రవారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీసుల విధివిధానాలకు అనుగుణంగా ఉత్సవ అసోసియేషన్ల సభ్యులు సహకరించాలని పూర్ణిమ కోరారు.

ఆంథోనీనగర్‌లో మహా అన్నదానం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు ఆంథోనీనగర్‌లో వినాయక మండపం వద్ద శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. సంఘ సేవకుడు మన్యాల శ్రీనివాస్ గణపతికి పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సూపర్ సిక్స్ హామీలు బూటకం



స్లేవ్‌గుర్తు వీధిలో మహిళలకు చంద్రబాబు మోసాలపై కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, తదితరులు



కల్లుపాకలు ప్రాంత వాసులకు కూటమి ప్రభుత్వ మోసాలపై కరపత్రాలు అందిస్తున్న కనకరెడ్డి

కంచరపాలెం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ హామీలన్నీ బూటకమని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ ప్రజా చైతన్య కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో వార్డులోని జ్ఞానాపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చెప్పిందొకటి.. చేస్తోంది మరొకటని విమర్శించారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలతో సంక్షేమాన్ని అటకెక్కించారని, ప్రజలను దారుణంగా వంచించారని, ప్రతి ఇంటా ప్రజలు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు కంటే అదనంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించామని గుర్తు చేశారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ మనందరి వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, వేళంగిణిరాజు, మధు, పరశురామ్, అర్జున్, మురళీ, కిషోర్, విక్రాంత్, శౌరీ, ఆకుల శ్యామ్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వార్డులోని 69వ బూత్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మిరపకాయల వీధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, హేమ, బంగారమ్మ, సౌత్ కల్చర్ వింగ్ అధ్యక్షులు సూర్యనాయుడు, బాడుగుల శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, పీవీన్ రెడ్డి, పులి, ధర్మరావు, గజ్జల బాలనారాయణరెడ్డి, మహేష్, సతీష్, రవీంద్రకుమార్, నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలుపున కనకరెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని 91వ బూత్ కల్లుపాకలు ప్రాంతంలో గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. పార్టీ సిటీ సెక్రటరీ అబ్బిరెడ్డి, ఆది విష్ణురెడ్డి. సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ సువార్త రాజు, సౌత్ పబ్లిక్ వింగ్ ప్రెసిడెంట్ జీరు సూర్యనారాయణ రెడ్డి, సౌత్ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ మళ్ల బుజ్జి, పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ విశాఖ సిటీ సెక్రటరీ కర్రి రాము, నాగిరెడ్డి, కొండమ్మ, నగేష్, శేఖర్ నాగర్జున తదితరులు పాల్గొన్నారు.